క్లుప్తంగా

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నెల్లూరు(వేదాయపాళెం): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుత్సల రామకృష్ణ పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులను సాధించిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను పొదలకూరు రోడ్డులోని హెచ్‌ఆర్ కల్యాణ మండపంలో నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు డాక్టర్ సతీష్‌కుమార్, రాఘవ పౌల్ట్రీ ఫార్మ్స్ అధినేత కర్ణ రాఘవరావు, పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్‌ఈ పముజుల నాగేశ్వరరావు, ఆక్వా ఫార్మ్స్ అధినేత పముజుల రవి, దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, జక్కల సురేష్, సజ్జా నవోదయ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న 900 మంది క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని ఆ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు నీలి సుబ్బరామయ్య, ఏకొల్లు రాఘవరెడ్డి సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టారు. నిర్వాహకులు అనంతరామారావు, వెంకటసురేంద్రబాబు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలకు ప్రతీక 'అశ్వతి'



కథల సంపుటి ఆవిష్కరణ

మర్రిపాడు: పొంగూరుకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్, రచయిత సడ్డా సుబ్బారెడ్డి రచించిన అశ్వతి కథల సంపుటి మానవతా విలువలు, గురుశిష్యుల అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఉందని బిట్స్ పిలానీ ప్రొఫెసర్ యడవల్లి రవి కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పొంగూరులో అశ్వతి కథల సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యడవల్లి రవి కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అశ్వతి కథల సంపుటిలోని ప్రతి కథ మానవతా విలువలను పెంపొందించేలా ఉందన్నారు. అంతేకాకుండా సమాజంలో గురువు ప్రాధాన్యాన్ని, శిష్యుల అభ్యున్నతికి వారు పడే తపనను సుబ్బారెడ్డి చాలా చక్కగా వివరించారన్నారు. రచయిత సుబ్బారెడ్డి మాట్లాడుతూ యండమూరి వీరేంద్రనాథ్ రచనలను స్ఫూర్తిగా తీసుకుని తాను కథలను రచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, మురళి, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో భారీ వర్షం

దుత్తలూరు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. వేకువజామున అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పిడుగులతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమలరేగడలో వేర్వేరుచోట్ల రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఎండ తీవ్రత పెద్దగా లేనప్పటికి ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు.

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వేకువన ఓ మోస్తరు వర్షం కురిసింది. వారంతో రోజులుగా ఎండతీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అర్ధరాత్రి 2 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకల్లోకి నీరు చేరింది. పొలాలు దున్నుకునేందుకు వర్షం దోహద పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షంతో వాతావరణం చల్లబడడంతో ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం



పంచాయతీ బస్టాండ్‌లో స్తంభించిన ట్రాఫిక్



బజారు సమీపంలోని రోడ్డుపై అడ్డంగా నిలిపిన ఆటోలు

- పొదలకూరులో ఇదీ పరిస్థితి
- ఆటోలతో సమస్య తీవ్రం

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ ఏ మాత్రం తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలు ఇష్టానుసారంగా వచ్చి ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారుతున్నాయి. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో బస్సులకు అడ్డంగా ఆటోలను ఉంచడం ద్వారా చిన్నపాటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాలుగు మండలాల వాహనాలు పట్టణం మీదుగా నెల్లూరు నగరానికి వెళ్లాల్సి ఉంది. ఫలితంగా నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు వ్యాపారులు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించడంతో ప్రధాన రహదారి కుచించుకుపోయింది. రాపూరు, సైదాపురం, చేజర్ల, కలువాయి మండలాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, లారీలు, టిప్పర్లతో పాటు ఆటోల సంచారం ప్రధాన సమస్యగా మారింది. పంచాయతీ బస్టాండ్ పోలీస్ అధికారుల పుణ్యమానని బాగుపడినా బస్టాండ్‌లోకి ఆటోలు వస్తూనే ఉన్నాయి. ఇక్కడి ట్రాఫిక్ సమస్య పోలీసులకు తలనొప్పిగా మారింది. ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపేస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

మితిమీరిన వేగం

పట్టణంలో కొత్తగా సిమెంట్ రోడ్డును నిర్మించారు. అయితే యువకులు ద్విచక్రవాహనాలపై మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు





కొడవలూరు: మెమొరీ గేమ్ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి సామర్థ్యం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి రాజేశ్వరి పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మెమొరీ గేమ్, మ్యూజికల్ చైర్స్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రీడలతో మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉంటారని చెప్పారు.

పెరిగిన నిమ్మ ధరలు

- బస్తా కాయలు రూ.ఆరు వేలు

పొదలకూరు: సాధారణంగా జూన్‌లో నిమ్మ ధరలు తగ్గుముఖం పడుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం రెండు రోజులుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో నిమ్మ ధరలు రూ.35 నుంచి రూ.75 వరకు పలుకుతున్నాయి. బస్తా (లూజు) టాప్ ధర రూ.ఆరు వేల వరకు పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. మార్కెట్‌కు ప్రస్తుతం కాయలు తక్కువగా వస్తుండటంతో ధరలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. మరోవైపు ఏలూరు, తెనాలి, గూడూరు తదితర మార్కెట్ల నుంచి కాయల ఎగుమతి తగ్గింది. తోటల నుంచి కాయలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో డిమాండ్ కొంత మేర పెరిగి జూన్‌లో ధరలు పలుకుతున్నాయి.



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

కుగ్రామానికి ఎట్టకేలకు తారు రోడ్డు



పొడమేకలకండ్రిగకు నిర్మించిన తారు రోడ్డు

- దశాబ్దాలుగా గ్రామస్తుల ఎదురుచూపులు
- గతంలో కాగితాలకే పరిమితం

పొదలకూరు: మారుమూల ఉన్న గ్రామానికి చక్కటి తారు రోడ్డును నిర్మించి పల్లెసీమలు పట్టణాలకు పట్టుగొమ్మలని ప్రభుత్వం నిరూపించింది. ఓటర్లు పెద్ద సంఖ్యలో లేరనే కారణంతో గ్రామం గతంలో నిరాదరణకు గురైంది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. ఆ తర్వాత రోడ్డును నిర్మిస్తారని గ్రామస్తులు ఎదురుచూపులు చూసి, చివరికి ఇక ఎప్పటికీ జరగదని నిర్ధారించుకున్నారు. ఈ తరుణంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో గ్రామానికి చక్కటి తారు రోడ్డును నిర్మించారు. ఫలితంగా రూ.1.38 కోట్లతో కుగ్రామానికి రోడ్డు నిర్మితమైంది. మండలంలోని అల్లూర్తి పంచాయతీలో పొడమేకలకండ్రిగ గ్రామం ఉంది. గ్రామానికి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం కూడా ఉండేది కాదు. ఇక్కడ తక్కువ సంఖ్యలో నివాసాలు ఉన్నాయని.. ఓటర్ల సంఖ్య పెద్దగా లేదంటూ గత ప్రభుత్వాలు రోడ్డు నిర్మాణానికి అందిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామానికి చక్కటి రోడ్డు ఏర్పడింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి కాకాణికి గ్రామస్తులు మద్దతుగా నిలిచారు.

అభ్యర్థుల ప్రతినిధులు, ఏజెంట్లతో సమావేశం



నెల్లూరు (బారకాసు): కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు, ఏజెంట్లు సహకరించాలని నెల్లూరు సిటీ ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. కౌంటింగ్ నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రతినిధులు, ఏజెంట్లతో అవగాహన సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియపై రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ఏజెంట్లకు అవగాహన కల్పించాలని సూచించారు. కనుపర్తిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పార్కింగ్ వసతిని కల్పించామని, అక్కడి నుంచి కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని కళాశాలకు ప్రత్యేక మినీ బస్సులను ఏర్పాటు చేశామని వివరించారు. కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, ఈ తరుణంలో వీటి కోసం డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏఆర్వోలు శర్మద, దేవీకుమారి, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, డీటీ మాధవి, స్వర్ణ, చక్రపాణి పాల్గొన్నారు.

నేత్రదానం



పుణ్యవతి (ఫైల్)

విడవలూరు: స్థానిక వెటర్నరీ ఆస్పత్రి వీధిలో నివాసం ఉంటున్న విడవలూరు సినిమా హాల్ యజమాని అడపాల కోటేశ్వరరావు భార్య పుణ్యవతి (86) ఆదివారం మరణించారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను నెల్లూరులోని అగర్వాల్స్ ఐ ఆస్పత్రి వారికి దానం చేశారు. మనసేవ సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమక్షంలో ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

విశేషాలంకారంలో ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు యాళి వాహనంపై ఆదివారం దర్శనమిచ్చారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా మెంటా సుబ్బారావు, సుబ్బలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. వివరాలు.. మూలాపేటలోని అరుంధతీయపాళెంలో నివాసం ఉంటున్న సతీష్ కొంత కాలం క్రితం ఇరుగాళమ్మ సెంటర్‌కు చెందిన రాజాకు రూ.50 వేలను అప్పుగా ఇచ్చాడు. ఈ మొత్తాన్ని తిరిగివ్వాలని రాజాను పలు మార్లు కోరగా, ఆయన నిరాకరించారు. ఈ నేపథ్యంలో మూలాపేటలోని ఓ దేవస్థానం వద్ద గత నెల 31వ తేదీ రాత్రి సతీష్ ఉండగా, రాజా అతని స్నేహితులు అక్కడికి చేరుకొని విచక్షణరహితంగా దాడి చేశారు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేశారు. దీంతో ఘటన స్థలానికి బీట్ పోలీసులు చేరుకొని వివరాలను సేకరించారు. దాడిలో గాయపడిన సతీష్ జీజీహెచ్‌లో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఎన్‌ఎంకు సత్కారం



నెల్లూరు(అర్బన్): విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడిన ఏఎన్‌ఎం సర్వేపల్లి శ్యామలను ఆదివారం ఘనంగా సత్కరించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి ఆవరణలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాస్పత్రి పీపీ యూనిట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. ప్రాణాలను కాపాడటం వైద్యశాఖ ఉద్యోగులకు గర్వకారణమని చెప్పారు. హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్‌కిరణ్, నేతలు మజరుల్లా, ఉమామహేశ్వరి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



కలశాలను తీసుకెళ్తున్న వేదపండితులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా కొమ్మి వేణుగోపాల్, కామాక్షి.. దాసరి శ్రీనివాసులు, అనూరాధ.. సుంకర రవికుమార్, గీత దంపతులు వ్యవహరించారు. పుష్పయాగం, ద్వాదశారాధన, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం తదితరాలను రాత్రి నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యదర్శి వాకాటి శ్రీనివాసులు రెడ్డి, శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



హోమం

వేడుకగా గ్రామోత్సవం

మనుబోలు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మనుబోలులో ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని వేడుకగా శనివారం అర్ధరాత్రి నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు, ప్రత్యేక పూజలను అర్చకుడు హనుమాచార్యులు జరిపారు. అనంతరం హనుమంతుడ్ని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆలయం వద్ద కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కట్టువపల్లి, చెర్లోపల్లి, యాచవరం గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చెవికల వెంకటరమణయ్య దంపతులు, రమేష్ బాబు కుటుంబసభ్యులు వ్యహరించారు.



యోగా గురువుకు సన్మానం

కొడవలూరు: మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా శిక్షకుడు జ్యోతి రాజేంద్రకుమార్‌ను కోవూరులోని జనచైతన్య యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడారు. యోగా సాధన ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని వివరించారు.



ఆంజనేయస్వామికి పుష్పాలంకారం

ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ముత్తుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు ప్రత్యేక పుష్పాలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు.
ఉభయకర్తగా రాజేంద్ర వ్యవహరించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోవూరు: బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు ఉన్నత పాఠశాలలో 1979 – 89 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకర్నొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను ఆరాతీశారు. అప్పటి ఉపాధ్యాయులు మహేష్, అమరేంద్రరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్‌లో అప్రమత్తంగా వ్యవహరించండి

- ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు (బారకాసు): కౌంటింగ్ ప్రక్రియలో అన్ని విభాగాల అధికారులు, సహాయక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కౌంటింగ్ సిబ్బందికి ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 4.30కు కౌంటింగ్ కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. కౌంటింగ్ స్టాఫ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను అబ్జర్వర్ సమక్షంలో ఉదయం ఐదుకు నిర్వహించనున్నామని వివరించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని వేర్వేరుగా కేటాయిస్తామని చెప్పారు. ఈవీఎంల సీలింగ్, వీవీ ప్యాట్ పేపర్ స్లిప్పుల కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ అంశాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని సూచించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, అత్యవసర జనరేటర్‌ను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మొబైల్ కలెక్షన్ పాయింట్, మెడికల్ హెల్ప్‌డెస్క్, పార్కింగ్ ప్రాంతం, పారిశుధ్య నిర్వహణపై విధివిధానాలను తెలియజేశారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఏఆర్వోలు శర్మద, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, వెంకటరమణ, ఆరోగ్యాధికారి వెంకటరమణ, ఎస్‌ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల అందజేత



నెల్లూరు(వేదాయపాళెం): మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూళ్లలో చదువుతూ పదో తరగతిలో 550కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కటారి తిరుపాల్ స్మారక అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. నగరంలోని ఐఎంఏ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ ఏడాది 96 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశామని చెప్పారు. జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, డాక్టర్ సుజాతమ్మ, మాదాల వెంకటకృష్ణ, డాక్టర్ వెంకటరాజేష్, రూపేష్, మేఘన, కేఎన్నార్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.